# ఎవరి కర్తవ్యమును వారు చక్కగా నిర్వర్తించినప్పుడే జగత్తు సుభిక్షంగా ఉంటుంది

**దైవాధీనం జగత్సర్వం సత్యాధీనంతు దైవతమ్**
**తత్ సత్యముత్తమాధీనం ఉత్తమః పరదేవతా.**

విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!

జగత్తంతయు దైవాధీనములోనున్నది. ఐతే యీ జగత్తు సత్యమునకు కట్టుబడి ఉంటున్నది. సత్యము ఉత్తముల ఆధీనమై ఉంటున్నది. ఉత్తములే యీ జగత్తునందు దైవస్వరూపులు. విశ్వము అనంతమైనది, అద్భుతమైనది. యీలాంటి సృష్టియొక్క తత్వమును మానవుడు గుర్తించుకోలేక కేవలము వ్యక్తిత్వమునే వ్యక్తపరుస్తూ అనేక విధములైన కష్టములకు గురౌతున్నాడు. సృష్టి అనగా ఈశ్వరేచ్ఛకు ప్రకటనయే! దీని పేరే ప్రకృతి. ఈ ప్రకృతియందు పుట్టిన ప్రతి మానవుడు ఈశ్వరస్వభావమే కలిగి ఉండాలి.

**సృష్టిలో ప్రకృతివైపరీత్యములకు మూలకారణము మానవునియొక్క ప్రవర్తనే!**

ఈశ్వరేచ్ఛను ప్రకటనచేసే నిమిత్తమై మానవుడు యీ జగత్తునందు ఉద్భవించాడు. మానవుడు యీ సృష్టిలో అంతర్భాగము. మానవుని ఉనికి జగత్తు ఉనికిపైన ఆధారపడి వుంటున్నది. కనుక, మానవుడు సృష్టిసంరక్షణ నిమిత్తమై తన మనుగడను కొనసాగించవలసి వస్తుంది. దురదృష్టవశాత్తు ఆధునిక యుగములో వైజ్ఞానికులయొక్క ప్రవర్తనయందు మానవత్వమనేది నశించి యీ జగత్తుకూడను తమ ఉపభోగ నిమిత్తమై యేర్పడినదిగా భావించడం జరుగుతున్నది. జగత్తు కేవలం మానవుని ఉపభోగ నిమిత్తమై యేర్పడినది కాదు. మానవుడు ఈనాడు ప్రకృతి శక్తులను యధేచ్ఛగా కొల్లగొట్టి, మానవత్వాన్ని విస్మరించి, సృష్టిని విపరీత పరిణామములకు గురి చేస్తున్నాడు. ఈ ప్రకృతి

sri sathyasai vachanamrutam

వైపరీత్యములకు మూలకారణము మానవునియొక్క ప్రవర్తనే! ఈనాడు లోకములో జరిగే భూకంపములకుగానీ, అగ్ని పర్వతములు బ్రద్దలుకావడానికిగానీ, అతివృష్టి అనావృష్టి బాధలకుగానీ, యుద్ధములకుగానీ, ప్రకృతి వైపరీత్యములే కారణము. ఈ ప్రకృతి వైపరీత్యములకు మూలకారణము, మానవునియొక్క ప్రవర్తనే! మానవునకు, జగత్తునకు ఉండిన సన్నిహిత సంబంధబాంధవ్యాన్ని మానవుడు గుర్తించుకొనలేకపోతున్నాడు.

**కర్మను ఆచరించక ఫలమును ఆశించేవాడు కేవలం మూర్ఖుడనే చెప్పవచ్చు**

ప్రకృతికి, మానవునికి ఉండిన సంబంధము ఎట్టిదో మొట్టమొదట గుర్తించాలి. కన్నులు, చెవులు, నోరు, కాళ్లు, చేతులు యీలాంటి అంగములన్నీ యీ దేహములో ఉంటున్నాయి. ఈ అంగములన్నీ దేహమునకు సంబంధించినవే! మానవునియొక్క శరీరము అంగములతో కూడినది. అంగములు మానవునకు ఎంత ప్రధానమో, మానవుడు సమాజమునకు అంత ఆధారము. మానవుడు సమాజములోని అంగమే! మానవుడు మానవత్వమునకు అంగము. మానవత్వము ప్రకృతికి అంగము. ప్రకృతి పరమాత్మకు అంగము. యీ విధమైన సన్నిహిత సంబంధమును మానవుడు అర్థముచేసుకోలేకపోతున్నాడు. మానవత్వాన్ని యీనాడు విస్మరిస్తున్నారు. ఈ మానవతా విలువలను విస్మరిస్తున్నారు. మానవత్వములో ఉండే విశిష్టతను గుర్తించుకోలేకపోతున్నారు. నిజముగా మానవుడు లోతుకు దిగి విచారించిన, మానవునకు ఎట్టి అధికారముగాని హక్కుగానీ లేదు, యీ జగత్తునందు. కర్తవ్యమే తన అధికారముగానీ, ప్రత్యేకముగా ఏ అధికారము తనకు లేదు. కర్తవ్యమును నిర్వర్తించక హక్కులకొరకు ప్రాకులాడటం వెఱ్ఱితనము. ఈనాడు లోకములో సంభవించే ప్రకృతి వైపరీత్యములకు మూలకారణము, మానవుడు తన కర్తవ్యమును విస్మరించటమే! ఎవరి కర్తవ్యమును వారు చక్కగా నిర్వర్తించినప్పుడు జగత్తు సుభిక్షంగా ఉంటున్నది. యజమానునియొక్క కర్తవ్యము చక్కగా నిర్వర్తించినప్పుడే పనివారియొక్క విలువ పెరుగుతుంది. తల్లితండ్రులు తమ కర్తవ్యమును చక్కగా నిర్వర్తించినప్పుడే బిడ్డలయొక్క క్షేమము అధికమవుతుంది. పిల్లలు తమ కర్తవ్యమును

సరిగా నిర్వర్తించినప్పుడే తల్లితండ్రులయొక్క గొప్పతనము వ్యాప్తమవుతుంది. అటులనే అధ్యాపకులు తమయొక్క కర్తవ్యమును చక్కగా నిర్వర్తించినప్పుడే విద్యార్థులయొక్క విశిష్టత అధికమవుతుంది. విద్యార్థులు తమ కర్తవ్యమును నిర్వర్తించినప్పుడే అధ్యాపకులయొక్క విలువ అధికమవుతుంది. యీనాడు ప్రపంచమునందు యీ కర్తవ్యముయొక్క సంబంధమును విస్మరిస్తున్నారు. జగత్తంతయు అంగాంగములయొక్క అన్యోన్య స్వరూపము. మన కర్తవ్యమును మనము సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఫలములు పొందుటకు మనకు అధికారము లభ్యమవుతుంది. 'కర్మణ్యేవ అధికారస్య మా ఫలేషు కదాచన' కర్మాధికారమును మనము చక్కగా నిర్వర్తించినప్పుడు ఫలము సహజముగానే మనకు ప్రాప్తిస్తుంది. కర్మను ఆచరించక ఫలమును ఆశించేవాడు మూర్ఖుడనే చెప్పవచ్చు. ఈనాడు మనకు కర్తవ్యమే నిజమైన అధికారము! ఈ కర్తవ్యమును విస్మరించటము పెద్ద దోషము.

**మానవ కళ్యాణమును అందించేది ఆధ్యాత్మికమే!**

విద్యార్థులారా! ఆలోచింపతగిన ప్రతి మానవుని అయోమయస్థితిలో ముంచెత్తే సమస్యలు యీనాడు విద్యారంగములోపల విరివిగా పెరిగినవి. మానవత్వములో విశిష్టతను గుర్తించుకోలేని అమాయకునికి మరింత తోడ్పడుతున్నది, యీ విద్యావిధానము. జీవితమునకు సంబంధించిన ప్రతి రంగమును పుష్టివంతముగాను ప్రయోజనవంతముగాను నిర్వహించవలసిన బాధ్యతను దేశపౌరులకందించవలసిన విద్యాసంస్థలు యీనాడు వక్రమార్గములో ప్రవేశించుచున్నవి. త్యాగము, శీలము, నీతి, నిజాయితి అనే మానవతా గుణములు యీనాడు మరుగున పడిపోయినవి. గౌరవ, మర్యాదలు మంటగలసినవి. ఈనాడు మనకు కావలసినది నూతనమైన విద్యకాదు, నూతన సమాజము కాదు, నూతన మతము కాదు. నవసమాజమును, సమసమాజమును స్థాపించాలని ఈనాడు అనేక ఊహాగానములు చేస్తున్నారు. ఇవన్నీ కాలహరణము గావించే కర్మలేగానీ యథార్థమైన స్వరూపములు కాదు. ఉత్తమ మనోబుద్ధులు కలిగినటువంటి స్త్రీపురుషులు యీనాడు అత్యవసరము. ఇలాంటి ఉత్తములైనటువంటి స్త్రీపురుషులు ఉండినప్పుడే రాజ్యము శ్రేయో

sri sathyasai vachanamrutam

రాజ్యముగా ఉంటుంది. చిత్తశుద్ధి, శీల సంపత్తి ఉండినప్పుడే సమాజములో ఉత్తమ స్త్రీపురుషులు అభివృద్ధి అవుతారు. నీతి పునాదులు దృఢంగా ఉండినప్పుడే చిత్తశుద్ధి, శీలసంపత్తి కలిగిన వ్యక్తులు పోషింపబడతారు. ఈ నీతి నిజాయితీలంతా ఆధ్యాత్మిక చైతన్యముపైన ఆధారపడి ఉంటాయి. ఆధ్యాత్మిక చైతన్యము మానవుని ఉన్నతస్థితికి గొనిపోయే పవిత్రమార్గము. ఉన్నత మానవునిగా తీర్చిదిద్దేది ఆధ్యాత్మికమే! దేశసౌభాగ్యమును అందించేది ఆధ్యాత్మికమే! లోకశాంతిని చేకూర్చేది ఆధ్యాత్మికము. మానవ కళ్యాణమును అందించేది ఆధ్యాత్మికమే!

## విద్య దేశశ్రేయస్సుకై ఉపయోగించాలి

ఆధ్యాత్మికతత్త్వమును యీనాడు విస్మరించి లౌకికాన్ని విశ్వసించి మానవత్వమును నిర్మూలము గావించుకొని కేవలము కృత్రిమమైన జీవితమును గడుపుతున్నాడు, మానవుడు. విద్యలు అధికంగా చదివినంతమాత్రమున విద్యావంతులు కాలేరు. ఈ విద్యలు దేశశ్రేయస్సుకై ఉపయోగించాలి. స్వార్థ, స్వప్రయోజనములను కొంచెము ప్రక్కకు పెట్టి లోకశ్రేయస్సుకై యీ విద్యను ఉపయోగపెట్టాలి. ఈ శ్రేయస్సు అందించే మార్గమునందు మనస్సు లగ్నమవాలంటే ఉత్తమ గుణములు విద్యార్థిలో అభివృద్ధి కావాలి. ఉత్తమ గుణములు కలిగిన విద్యార్థియందే దేశాభిమానముగానీ సమాజాభిమానముగానీ అభివృద్ధిగాంచుతాయి. సత్యమనేది కేవలము కంఠమునకు భూషణము. విద్య శ్రవణమునకు భూషణము. ఈ భూషణములకంటె ఇతర భూషణములు మనకెందుకు? ఈ భూషణములు కల్గిన మానవుడే పరిపూర్ణ మానవుడు కాగలడు. ఈనాడు లౌకిక విద్యలనభ్యసించినంత మాత్రమున తనను తాను గొప్ప జ్ఞానిగా భావించుకొని విఱ్ఱవీగుతున్నాడు మానవుడు. రాముడు ఎన్ని విద్యలు అభ్యసించాడో రావణుడు అంతకంటే ఎక్కువగా విద్యలభ్యసించాడు. కానీ, రావణుని వాల్మీకి 'మూర్ఖుడ'ని అన్నాడు. రాముడు 'పూర్ణమానవుడ'ని వర్ణించాడు. ఈ పూర్ణ మానవత్వమునకు, మూర్ఖత్వమునకు గల వ్యత్యాసము గుర్తించాలి. రాముడు తను అభ్యసించిన విద్యలన్నీ లోకశ్రేయోభివృద్ధికై, లోకక్షేమమునకై వినియోగించాడు. ఇంద్రియములను నిగ్రహించాడు. తనకు దక్కిన

srisathyasaivachanamrutam

రాజ్యాధికారమును త్యజించాడు. సత్యధర్మములను కాపాడాలని దీక్ష వహించాడు. దీని నిమిత్తమై తన విద్యను అంతా ధారపోసి ఆదర్శవంతమైన జీవితమును జగత్తునకు అందించాడు. ఈ త్యాగము, శీలము, నీతి, నిజాయితీ రామునిలో ఉండటంచేతనే రాముడు పూర్ణమానవుడుగా రూపొందాడు. కానీ రావణుడు తాను నేర్చిన విద్యలు కేవలము విషయభోగములో ప్రవేశపెట్టి, యింద్రియలోలుడై తనను, తన రాజ్యాన్నికూడను భస్మము గావించుకున్నాడు. ఎన్ని విద్యలు నేర్చినప్పటికిని, ఎంత ఘనుడని ప్రఖ్యాతి పొందినప్పటికిని, 'సర్వే లోకహితే రతః' యీ విద్యలను లోకహితముకొరకు ధారపోయాలి. అప్పుడే 'సర్వేజ్ఞానైక సంపన్నః,' అతడు జ్ఞానసంపన్నుడు కాగలడు. సమస్తమైన ఉత్తమ గుణములు కలవాడుగా రూపొందుతాడు. యిలాంటి మానవత్వాన్ని జగత్తుకు అందించే నిమిత్తమై ఆనాడు యీ విద్యలు యేర్పడినవి.

**అన్యాయ, అక్రమ, అనాచార, అసత్యములను ఎదుర్కొని సత్యధర్మములను సాధించే నిమిత్తమై అభ్యసించే విద్యయే భారతీయ విద్య**

ఈనాడు విద్యార్థులు చదివే విద్యలన్నీ మానసిక దాసత్వమును, అధికారదాసత్వమును బోధించేవి, భారతీయ విద్యలు కావు. నీతి నిజాయితీలను నిర్మూలము గావించుకొని మానవత్వమును విస్మరించి కేవలము స్వార్థస్వప్రయోజనముల నిమిత్తమై ప్రాకులాడేది, భారతీయ విద్య కానేరదు. అన్యాయ, అక్రమ, అనాచార, అసత్యములను ఎదుర్కొని సత్యధర్మములను సాధించే నిమిత్తము అభ్యసించే విద్యయే భారతీయ విద్య. ధనమును అనేక రీతులుగా వ్యయము చేసి కేవలము 'డిగ్రీ' అనే భిక్షాపాత్రను చేతికందుకొని ఆఫీసు, ఆఫీసుకు పోయి 'ఉద్యోగము,' 'ఉద్యోగము' అని భిక్షాటనము చేసే విద్య, భారతీయ విద్య కాదు. స్వశక్తిపైన ఆధారపడడానికి దోహదం చేసేదే భారతీయ విద్య. స్వార్థమును విస్మరించి సమాజ సేవలో పాల్గొనటము నేర్పేదే భారతీయ విద్య. ధనమును పుచ్చుకొని వీధుల వెంబడి నినాదములు చేసే వాలంటీర్లుగా తయారుచేసే విద్య కాదు, భారతీయ విద్య. భారతీయ విద్య అనగా 'సత్యం వద, ధర్మం చర.' ప్రేమయే మానవ జీవితమునకు ప్రాణము.

srisathyasaivachanamrutam

సత్యమే ప్రాణమునకు శ్వాస. యిట్టి విశ్వాసముతో జీవితమును గడిపిన వ్యక్తులు ఎంతమందినో కన్నటువంటిది, యీ భారతదేశము. వజ్రము అనేక ముఖములుగా కాంతిని ప్రసరింపచేయుచు ప్రకాశింప చేసినట్లుగా భారతీయ విద్య అనేక విధములుగా మానవత్వములో ఉన్న దివ్యత్వాన్ని ప్రకటనము గావించేటువంటిది.

## భారతదేశ విశిష్టతను విద్యార్థులు గుర్తుంచుకోవాలి

భారతదేశము అనేక దళములతో కూడిన పద్మమువంటిది. భారతదేశములో ఉన్న వైవిధ్యమైన కులమతములుగానీ, వేషభాషలుగానీ, ఆచార విచారములుగానీ, నీతినియమములుగానీ ఏ దేశమునందుకూడను కానరావు. అనేక భాషలతో కూడినది భారతదేశము. అనేక వేషభాషలతో కూడినది భారతదేశము. నీతినిజాయితీలతో కూడినది భారతదేశము. అనేకమంది మహర్షులు, సిద్ధపురుషులు, యోగులు, ప్రవక్తలకు జన్మనిచ్చినది, భారతదేశము. భారతదేశము సుందరమైన ఉద్యానవనమువంటిది. రకరకములైనటువంటి సుగంధ పరిమళభరితమైన పుష్పములతో కూడినటువంటిది. యిట్టి భారతదేశ విశిష్టతను యీనాడు భారతీయులు విస్మరించారు. భారతీయుల ఉదారగుణము, ఐకమత్యము ఏ యితరదేశమునందు కానరావు. అన్ని మతములవారు భారతదేశమనే భవనములో అన్యోన్యముగా అన్నదమ్ములుగా జీవించడానికి అవకాశమును ఇచ్చింది, ప్రాచీనకాలమునుండి. యిలాంటి అన్యోన్యతను యీనాడు భారతదేశము కోల్పోయింది. ఈ ప్రేమతత్త్వము యీనాడు నశించిపోయింది. సత్యము అంటే ఏమిటో గుర్తించుకోటానికి వీలులేనిదిగా మారిపోయింది. భారతదేశముయొక్క విశిష్టతను విద్యార్థులు గుర్తుంచుకోవాలి. కేవలము స్వార్థస్వప్రయోజనముల నిమిత్తమై జీవించకూడదు. స్వార్థము పూర్తిగా త్యాగము చేయాలి. అప్పుడే దివ్యమైన విద్యను మనం గ్రహించినవారమవుతాము.

## భారతీయ సంస్కృతిని ఏనాడు ఉల్లంఘించెదరో ఆనాడే జీవితము పెడమార్గము పడుతుంది

విద్యార్థులారా! విద్యాభ్యాసము పూర్తయిన తరువాత గృహస్థాశ్రమములో ప్రవేశించక పూర్వము విద్యార్థులందరిని చేర్చి అధ్యాపకులు సువిషయములను వారికి



sri sathyasai vahini vachanamrutam

బోధించేవారు. దానినే 'స్నాతకోత్సవమ'ని పిలుస్తూ వచ్చారు. ఆ స్నాతకోత్సవములో యిచ్చే ఉపదేశములు ఏమిటి? 'జగత్తుకు నీవు ఉపకారిగా నిల్చాలి. తల్లితండ్రులను మొట్టమొదట గౌరవించి, ప్రేమించాలి. జాతీయ అభిమానమును మీరు పెంచుకోవాలి. దేశాభిమానము అత్యవసరంగా ఉండాలి.' ఇటువంటి బోధలను చేసేవారు. ఈ దేశాభిమానమునే కోల్పోయి కేవలం విద్యను పూర్తి గావించామని ఉన్నతవిద్యకై విదేశాలకు ప్రయాణము చేసేవారు దేశాభిమానులు ఎట్లా అవుతారు? కనుక, దేశాభిమానమును విద్యార్థులు ప్రధానంగా పెంచుకోవాలి. సమాజానికి ఉపయోగపడే జీవితమును మనం గడపాలి. జాతీయతా భావము, దేశగౌరవమును పెంపొందించుకోవాలి. ఇవియే ఆనాడు ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించిన ప్రధానబోధలు. ఈనాడు మీరందరు 'యీ రీతిగా నడుచుకుంటాము, ఆదర్శవంతముగా జీవిస్తాము,' అని ప్రమాణాలు చేశారు. ఈ ప్రమాణములు జీవితములో చివరివరకు నిలబెట్టుకోవాలి. కేవలము స్నాతకోత్సవ సమయములో ప్రమాణములు ఉచ్చరించి తరువాత ఆ ప్రమాణములు విస్మరిస్తే మీకు మీరు ద్రోహము చేసుకున్నవారవుతారు. విద్యార్థులారా! మీరు అభ్యసించిన విద్యలన్నియు సమాజక్షేమముకొరకు ప్రవేశపెట్టి సమాజక్షేమాన్ని దృష్టియందుంచుకొని భారతీయ సంస్కృతిని కాపాడుతూ రావాలి. ఈ సంస్కృతిని యేనాడు ఉల్లంఘించెదరో ఆనాడే మీ జీవితము పెడమార్గము పడుతుంది. అధికారమునకు మీరు ప్రాకులాడకండి. ఆచరణకు మీరు తయారుగా ఉండండి. ఆచరణలో మీరు ప్రవేశించండి. పది చెప్పేదానికంటే ఒకటి చేసి చూపించండి.

**ధనసంపాదన ప్రధానముకాదు, గుణ సంపాదన అత్యవసరము**

అచరణే మన విద్యార్థులకు అత్యవసరమైనది. ఈ ఆచరణలోనే జీవితానికి సాఫల్యము చేకూరుతుంది. ధనసంపాదన మనకు ప్రధానము కాదు, గుణసంపాదన అత్యవసరము.

**నేటి విద్య తెలివితేటలనే పెంచు**
**కొంచెమైన గుణము పెంచబోదు**
**కోటివిద్యలుండి గుణము లేకున్నచో**

sri sathyasai vahamrutam

**ఫలమదేమి దాని విలువదేమి?**

**చదివి వ్రాయ నేర్చినవారందరు విద్యావంతులేనా?**
**కాలేజి డిగ్రీని పొంద విద్యావంతుడగునా?**
**సుజ్ఞానము సుకృతములు లేని విద్యలు సద్విద్యలగునా?**
**బ్రతుకుటకే విద్యయన్న బ్రతుకుటలేదె పశు పక్షులు!**

వృత్తికోసమా మన విద్యలు? కాదు, కాదు. పశుపక్షులు బ్రతుకుటలేదా? అవి ఏ కాలేజీకి పోతున్నాయి? ఎక్కడ డిగ్రీలు తీసుకుంటున్నాయి? కాలేజీకి వెళ్లి విద్యనభ్యసించి డిగ్రీలు పొంది మీరుకూడను పశువులవలె ప్రవర్తిస్తే విద్యకు, అవిద్యకు ఉండిన భేదము ఏమిటి?

**సేవకుడే నిజమైన నాయకుడు!**

విద్యార్థులారా! పల్లెలలో మీరు ప్రవేశించాలి. బీదప్రజలకు తగిన సహాయము చేయాలి. సేవలు చేయటమే విద్యయొక్క సారము. దేశసేవలో మనము పాల్గొనాలి. సమాజసేవకంటే మించిన సేవ, ఉద్యోగము మరొకటి లేదు. సేవకుడే నిజమైన నాయకుడు. మీరు సేవలో నాయకత్వమును వహించండి. ఈ విధమైన పవిత్రతను యేనాడు మీరు పెంచుకొనగలరో ఆనాడే మీరు విద్యావంతులు, పూర్ణ ఆదర్శప్రాయులు అవుతారు. ఇతర యూనివర్సిటీలలో యేవిధంగా జరిగినప్పటికి మనయొక్క సత్యసాయి ఇన్స్టిట్యూట్‌లో వున్న విద్యార్థులు ఆదర్శవిద్యార్థులుగా రూపొందాలి. నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక శక్తులను మీరు క్రోడీకరించుకోవాలి. నిజముగా మనకు ఆదర్శవంతమైన నీతియే లేకపోతే మన జాతి మనుగడ సాగించలేదు. మనది నీతి కలిగిన జాతి, నిజమైన జాతి.

**జాతి గౌరవంబు నీతిపై నిలుచును**
**నీతి లేకయున్న జాతి చెడును**
**నీతి కల్గు జాతి నిజమైన జాతిరా**
**వినుము భారతీయ వీరసుతుడ!**

నీతికై నీ జీవితాన్ని త్యాగము చేయి. నీతిని పోగొట్టుకొన్నవాడు ఎంత అధికారి



srisathyasaivahanamrutam

అయినప్పటికిని, వాడు అవినీతిపరుడేగాని నీతిపరుడు కాలేడు. అట్టి వ్యక్తులవల్ల సమాజము యేనాడు అభివృద్ధి గాంచలేదు. భారతదేశముయొక్క విశిష్టతను వాడు ఏనాడు కాపాడుకోలేడు. కనుక విద్యార్థులారా! విద్యావిధానాన్ని చక్కగా గుర్తించి వర్తించటము అత్యవసరము. మీరు భగవద్భావములో మునగండి. అందరిని భగవద్భావములో ముంచండి.

Live in God, make others live in God.

**(తేదీ 22-11-1992న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam